

జిల్లా కో ఆపరేటివ్ అధికారిగా కిరణ్‌కుమార్


కలెక్టర్‌ను కలిసిన డీసీవో

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 23 : సంగారెడ్డి జిల్లా కోఆపరేటివ్ అధికారిగా ఆర్.కిరణ్‌కుమార్ బదిలీపై వచ్చారు. ఈమేరకు శుక్రవారం నాడు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ క్రాంతిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన డీసీవో ప్రసాద్ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు.

ఇక.. పశుగణన

సెప్టెంబరు 1 నుంచి మెదక్ జిల్లాలో 469 గ్రామాల్లో సర్వే
60 మంది ఎన్యుమరేటర్లు, 20 మంది సూపర్‌వైజర్ల నియామకం
గత ఐదేళ్లలో గొర్రెల సంఖ్య గణనీయంగా తగ్గినట్లు అంచనా



2019 పశుగణన సర్వే వివరాలు

ఆవులు, ఎద్దులు	54,181
గేదెలు	1,22,444
కోళ్లు	30,00,000
గొర్రెలు	3,91,000
మేకలు	1,10,275
కుక్కలు	17,559
పందులు	4,000
పెంపుడు కుక్కలు	1,100
మినీ డెయిరీ ఫారాలు	60
కోళ్ల ఫారాలు	180

మెదక్, ఆగస్టు 23: రాష్ట్రంలో ఐదేళ్లకోసారి నిర్వహించే పశుగణన వచ్చే నెల 1 నుంచి నిర్వహించేందుకు మెదక్ జిల్లా అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తున్నది. సెప్టెంబరు 1 నుంచి డిసెంబరు 31 వరకు పశుగణన నిర్వహించనున్నారు. జిల్లావ్యాప్తంగా 469 గ్రామాల్లో పర్యటించి 16 రకాల పశు జాతుల వివరాలు సేకరించనున్నారు. సర్వేలో 60 మంది ఎన్యుమరేటర్లు, 20 మంది సూపర్ వైజర్లు పాల్గొంటున్నారు. జిల్లావ్యాప్తంగా తెల్ల జాతి పశువులైన ఆవులు, ఎద్దులు.. గేదె జాతి పశువులు, కోళ్లు, గొర్రెలు, మేకలు, కుక్కలు, పందులు, పెంపుడు కుక్కలు, డెయిరీ ఫారాలు, కోళ్లఫారాలను లెక్కించనున్నారు. ఈ మేరకు గురువారం మెదక్‌లో పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లకు సర్వే విధానంపై శిక్షణ ఇచ్చారు.

లక్ష గొర్రెలు మాయం

2019 పశుగణన లెక్కలతో పోలిస్తే ప్రస్తుతం పశువుల సంఖ్య గణనీయంగా తగ్గినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో గొల్ల కుర్మలకు ఇచ్చిన గొర్రెల యూనిట్లు పక్కదారి పట్టినట్లు వెల్లడి కావడంతో ఇటీవల ప్రభుత్వం జీవాల లెక్క తీయాలని పశుసంవర్ధకశాఖను ఆదేశించింది. ఆ శాఖ సిబ్బంది చేపట్టిన సర్వేలో జిల్లాలో జీవాల సంఖ్య తగ్గినట్లు వెల్లడైంది. ఐదేళ్ల క్రితం పశుగణన వివరాలతో పోలిస్తే లక్ష గొర్రెలు తగ్గినట్టు గుర్తించారు. 2019 సర్వేలో 3,91,000 గొర్రెలు ఉన్నట్టు నమోదుకాగా.. ప్రస్తుతం 2,89,734 మాత్రమే ఉన్నట్లు తేలింది. గత ప్రభుత్వం గొర్రెల యూనిట్ల పంపిణీ పథకంలో జిల్లాలో 3 లక్షల గొర్రెలను పంపిణీ చేసినట్టు లెక్కలు చెబుతున్నాయి. అప్పటికే ఉన్నవాటితో కలిస్తే గొర్రెల సంఖ్య రెట్టింపు కావాల్సి ఉన్నప్పటికీ... ఐదేళ్ల క్రితం ఉన్న లెక్కలోనే సుమారు లక్ష జీవాలు తగ్గినట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం పంపిణీ చేసిన గొర్రెలు ఏమయ్యాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మాంసం కోసం వీటి వినియోగం ఉంటున్నప్పటికీ వీటి సంఖ్య సగానికి తగ్గడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

కచ్చితమైన వివరాలు సేకరిస్తాం

జిల్లాలో పశుగణన నిర్వహించడానికి సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నాం. సర్వేలో కచ్చితమైన ఫలితాలు రాబట్టడానికి శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తున్నాం. వచ్చే నెల 1 నుంచి 3 నెలల పాటు పశుగణన జరిపిస్తాం.

-వెంకటయ్య, జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి



పెద్దల సభకు పోటాపోటీ..

ఉమ్మడి మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు సంబంధించిన పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు గడువు సమీపిస్తోంది. ప్రస్తుతం పట్టభద్రుల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కూర రఘోత్తమరెడ్డి ఉన్నారు. ఆరు సంవత్సరాల పదవీకాలానికి గాను 2019 మార్చి నెలలో ఎన్నికైన వీరి పదవీకాలం వచ్చే మార్చితో ముగియనుంది. అప్పటిలోగా ఈ స్థానాలకు ఎన్నికలను నిర్వహించేందుకు వచ్చే నెల నుంచే ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ఆశావహులు ఇప్పటి నుంచే తమ ప్రయత్నాలు మొదలు పెట్టారు.

- ఉమ్మడి మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల సందడి
- పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలపై పలువురి ఆశలు
- వచ్చే ఏడాది మార్చితో ముగియనున్న జీవన్‌రెడ్డి, రఘోత్తమరెడ్డి పదవీకాలం
- సెప్టెంబరు నుంచే ఓటర్ల ఎన్‌రోల్‌మెంట్
- ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్న ఆశావహులు
- మద్దతు కోసం ఆయా పార్టీల ముఖ్యనేతలతో మంతనాలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఆగస్టు 23: అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల ఫలితాలపై గ్రామాల్లో చర్చ కొనసాగుతూనే ఉంది... ఇంతలోనే గ్రామ పంచాయతీలు, స్థానిక సంస్థల పదవీకాలం ముగిసింది. పాలనా సౌలభ్యం కోసం ప్రత్యేకాధికారులను నియమించినా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతుండగానే శాసనమండలి ఎన్నికలపై చర్చ మొదలైంది. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో భిన్న ఫలితాలు రావడంతో విద్యావంతులు ఎవరి వైపు మొగ్గుచూపుతారోననే ఉత్కంఠ రేకెత్తిస్తోంది.

ఆరు నెలల ముందే సందడి

పట్టభద్రుల ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి పదవీకాలం ఆరునెలల్లో ముగియనుంది. ఆయా స్థానాలను దక్కించుకోవడానికి ఆశావహులు ఇప్పటి నుంచే ప్రయత్నాలు ప్రారంభించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు గ్రాడ్యుయేట్ ఓటర్ల జాబితాను సిద్ధం చేయాల్సి ఉంటుంది. ఈసారి కూడా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్లుగా డిగ్రీ పూర్తిచేసిన వారందరిని సెప్టెంబరు నుంచే నమోదు చేయాలని ఆదేశాలు వచ్చాయి. ఈక్రమంలో ఎమ్మెల్సీ పదవులను ఆశిస్తున్నవారు తమకు అనుకూలమైన పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించుకోవాలని కోరుతున్నారు. వాట్సాప్‌గ్రూపులు తయారు చేసి టచ్‌లో ఉంటున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఆశావహులు సైతం ప్రభుత్వ ఉపాధ్యాయులతో ప్రత్యేక వాట్సాప్‌గ్రూపులను ఏర్పాటు చేస్తున్నారు. ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు కూడా తమ సంఘం సభ్యుడికే పదవి రావాలని అప్రమత్తమవుతున్నారు.

తాయిలాలు.. సేవా కార్యక్రమాలు

ఎమ్మెల్సీ రేసులో ఉన్న పలువురు ఆశావహులు ఇప్పటి నుంచే ప్రచారం షురూ చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పదవిని ఆశిస్తున్న ఓ వ్యక్తి ఇటీవల సిద్దిపేటలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. పలువురు ఉపాధ్యాయులను సమీకరించి హామీలు గుప్పించాడు. తాయిలాలు సైతం సమర్పించుకున్నాడనే చర్చ జరుగుతోంది. ఆర్థికపరమైన లోటు లేకపోవడంతో మద్దతు కోసం ఆయా పార్టీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు. అదేవిధంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న ఓ వైద్యుడు సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నారు. పోటీపరీక్షలకు సిద్దమవుతున్నవారికి పుస్తకాలు ఇచ్చి సాయపడుతున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ రేసులో ఉన్న మరో విద్యావేత్త స్థానికంగా ఉన్న నిరుద్యోగుల కోసం కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. మరికొంతమంది కూడా తెరవెనుక ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇప్పటి నుంచే ప్రజాక్షేత్రంలోకి అడుగుపెడితే ఆర్థికంగా నష్టపోతామని వెనకాడుతున్నారు.

ముఖ్యనేతల చుట్టూ ప్రదక్షిణలు

ఆరేళ్ల పదవీకాలం, పెద్దల సభలో సభ్యుడిగా గౌరవం పొందాలనే ఉద్దేశంతో చాలామంది ఆశావహులు ఎమ్మెల్సీ పదవి కోసం ప్రయత్నం చేస్తున్నారు. అదృష్టం కలిసివస్తే మంత్రిగా లేదంటే విప్‌గా, చీఫ్ విప్‌గా కూడా అవకాశం దక్కవచ్చని భావిస్తున్నారు. ఇవేవీ దక్కకున్నా ప్రొటోకాల్ పదవిని అనుభవించవచ్చని ఆశిస్తున్నారు. అందుకే ఓవైపు గ్రాడ్యుయేట్లు, టీచర్ల ఓటర్లపై దృష్టి పెడుతూనే మరోవైపు రాజకీయ పార్టీల మద్దతు కోసం ఆరాటపడుతున్నారు. క్రితంసారి కాంగ్రెస్ మద్దతుతో పట్టభద్రుల ఎమ్మెల్సీగా జీవన్‌రెడ్డి గెలిచారు. మరోసారి ఎమ్మెల్సీగా బరిలో ఉంటారనే ప్రచారం జరుగుతోంది. ఆయనతోపాటు మరికొందరు కాంగ్రెస్ నేతలు ఎమ్మెల్సీ రేసులో ఉన్నారు. ఇక బీఆర్ఎస్, బీజేపీ ముఖ్యనేతలను కూడా కొందరు సంప్రదిస్తున్నారని తెలిసింది. అభ్యర్థిత్వం ఖరారు చేస్తే ఖర్చు ఎంతైనా పెట్టుకుంటామని చెబుతున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రేసులో ఉన్నవారు కూడా పార్టీల మద్దతు కోసం ప్రయత్నిస్తున్నారు.


ఖేడ్ గ్రామీణ వికాస్ బ్యాంకు ఎదుట నిరీక్షిస్తున్న రైతులు

రుణమాఫీ కోసం బారులు

- వరుసలో డాక్యుమెంట్లు
- తెల్లవారుజాము నుంచే రైతుల నిరీక్షణ

నారాయణఖేడ్, ఆగస్టు 23: రైతులను రుణ విముక్తులను చేయడం కోసం రూ.2 లక్షల లోపు ఉన్న పంట రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. వారందరికీ వెంటనే కొత్త రుణాలు ఇవ్వాలని ఆదేశించింది. దీంతో కొత్త రుణాల కోసం బ్యాంకుల ఎదుట రైతులు బారులుతీరుతున్నారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణంలోని గ్రామీణ వికాస్ బ్యాంకు పరిధిలో 8 వేల మంది రైతులకు రుణమాఫీ జరిగింది. వారందరూ కొత్త రుణాల కోసం బ్యాంకుకు తరలివస్తున్నారు. బ్యాంకు అధికారులు ప్రతీరోజు రెండు గ్రామాల రైతులకు టోకెన్లు ఇచ్చి.. వరుస ప్రకారం కొత్త రుణాలు ఇస్తున్నారు. శుక్రవారం నాగల్‌గిద్ద మండలం ఇరక్‌పల్లి దామర్‌గిద్ద గ్రామాలకు చెందిన రైతులకు టోకెన్లు ఇస్తారని తెలియడంతో ఉదయం నుంచే రైతులు బ్యాంకు వద్దకు చేరుకున్నారు. బ్యాంకు తెరిచేవరకు వరుసలో నిలబడలేక డాక్యుమెంట్ల ప్రతులను బ్యాంకు ముందు వరుసలో ఉంచి నిరీక్షించారు.

నూతన ఆర్వోఆర్ చట్టంపై సలహాలివ్వండి : కలెక్టర్


చర్చా వేదికలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, ఆగస్టు 23: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న నూతన ఆర్వోఆర్ చట్టం ముసాయిదా బిల్లుపై సలహాలు, సూచనలు అందజేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన చర్చావేదికలో ఆయన మాట్లాడారు. రైతుల ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం వారితో చర్చించి సమగ్రమైన చట్టం తెచ్చేందుకు అన్ని జిల్లాల్లో చర్చా వేదికలు ఏర్పాటు చేసిందని తెలిపారు. రైతలు, రైతు సంఘాలు, విశ్రాంత అధికారులు, న్యాయవాదులు, మేధావులు.. తదితర వర్గాల ప్రజల నుంచి ముసాయిదా బిల్లుపై అభిప్రాయాలను సేకరించి ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. చట్టం రూపకల్పనలో భాగంగా అభ్యంతరాలు సలహాలు, సూచనల కోసం ప్రభుత్వం ప్రత్యేక వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ఈ వెబ్‌సైట్ ద్వారా సలహాలు, సూచనలు అందచేయాలని సూచించారు. కార్యక్రమంలో మెదక్, తూప్రాన, నర్సాపూర్ ఆర్డీవోలు రమాదేవి, జయచంద్రారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, ఏడీఏ గోవింద్, అన్ని మండలాల తహసీల్దార్లు, రైతులు, రైతు సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

‘బోరంచ’కు పర్యాటక శోభ వచ్చేనా?

- అభివృద్ధికి అనుకూలం
- జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాల నుంచీ భక్తులు
- పరిశీలించిన ఫారెస్ట్ కన్జర్వేటర్



నారాయణఖేడ్, ఆగస్టు 23 : సంగారెడ్డి జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన బోరంచ నల్లపోచమ్మ ఆలయ ప్రాంతానికి పర్యాటక శోభ వస్తుందన్న ఆశలు చిగురిస్తున్నాయి. రోజురోజుకూ ఆలయానికి భక్తుల తాకిడి పెరుగుతుండడంతో అభివృద్ధి పనులు, సౌకర్యాల కల్పనకు ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి చొరవ చూపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి సారించడంతో ఈ ప్రాంత ప్రజల కల సాకారం కానున్నది.

మూడు రాష్ట్రాల సరిహద్దులో...

మూడు రాష్ట్రాలకు సరిహద్దులో మంజీరానది ఒడ్డున నారాయణఖేడ్ నియోజకవర్గం మనూరు మండలంలోని బోరంచ వద్ద నల్లపోచమ్మ ఆలయం ఉన్నది. మహిమాన్వితంగల అమ్మవారుగా పేరుగాంచిన నేపథ్యంలో భక్తులు వేలాదిగా తరలివస్తుంటారు.నది తీరాన ఆలయం ఉండడంతో ప్రజలకు రవాణా పరంగా ఎంతో సౌకర్యవంతంగా ఉన్నది. ఏటా ఏడు వారాలపాటు జరిగే జాతర సమయంలో నిత్యం 10 వేలకుపైగా భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. కాగా, ప్రస్తుతం ఈ ఆలయం ప్రతి రోజూ భక్తులతో కిటకిటలాడుతుంది. ఉమ్మడి జిల్లాతో పాటు హైదరాబాద్, కామారెడ్డి, నిజామాబాద్, వికారాబాద్, జిల్లాలు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు వస్తుంటారు. అయితే దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలో ఉన్న ఈ ఆలయ అభివృద్ధి కోసం గతంలో ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికకు చర్యలు

ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి ఇటీవల రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి నల్లపోచమ్మ ఆలయ పరిస్థితిని వివరించి, నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక కోసం రాష్ట్ర అటవీ శాఖ ప్రధాన కార్యాలయానికి చెందిన కన్జర్వేటర్ కృష్ణ నెల రోజుల క్రితం ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. అనంతరం ఆలయ పరిసరాలు, భూములు, సమీపంలో ఉన్న ఆలయాలు, మంజీరా నది తదితరాలను పరిశీలించారు. ఆలయాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అన్ని రకాలుగా అనుకూలంగా ఉన్నట్లు వివరించారు.

అన్నింటికీ అనుకూలం

ఆయా ప్రాంతాలను పరిశీలించిన వారు పర్యాటక అభివృద్ధిలో భాగంగా కాటేజీల నిర్మాణం, హరిత హోటల్, నదిలో బోటింగ్, పిల్లలు ఆడుకునేందుకు ఆటలపార్కు, గ్రీన్ టన్నెల్స్, రసోయి, కొండలపైకి ఎక్కేందుకు ట్రెక్కింగ్ ఏర్పాట్లకు ఈ ప్రాంతం అనుకూలంగా ఉందని వెల్లడించారు. ఖేడ్ పట్టణం నుంచి ఆలయం కేవలం 15 కిలో మీటర్ల దూరం ఉండడం.. కర్ణాటక, మహారాష్ట్రలకు 35 కిలో మీటర్ల దూరం మాత్రమే ఉండడంతో భక్తుల తాకిడి అధికంగా ఉంటుందని, దీంతో పర్యాటక రంగం అభివృద్ధికి అన్ని విధాలుగా బాగుంటుందని స్థానికులు ఈ సందర్భంగా అధికారులకు వివరించారు.

అభివృద్ధికి ఆస్కారం

నల్ల పోచమ్మ ఆలయాన్ని పర్యాటకరంగంగా తీర్చిదిద్దితే ఈ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉన్నది. నది తీరంలో నల్లపోచమ్మ ఆలయం, సమీపంలోనే సంగమేశ్వర, సాంబశివుడి ఆలయాలు, ఎన్నడూ ఎండని మంజీరా నది బ్యాక్ వాటర్, రెండు వైపులా కొండలు, విశాలమైన ప్రాంతం ఉండడం పర్యాటక రంగాభివృద్ధికి అనుకూలంగా మారింది. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి పరిస్తే ప్రాంతం రవాణా పరంగా అభివృద్ధి చెంది భక్తుల తాకిడి మరింతగా పెరిగేందుకు ఆస్కారం ఉంది.

పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తా



బోరంచ నల్లపోచమ్మ ఆలయాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తా. మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు అటవీశాఖ కన్జర్వేటర్ ప్రాంతాన్ని పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు.

-సంజీవరెడ్డి, ఎమ్మెల్యే, నారాయణఖేడ్

చదువంటే ఇష్టం లేక.. భవనంపై నుంచి దూకి..

బీసీ గురుకుల పాఠశాల విద్యార్థినికి గాయాలు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 23 : చదువంటే ఇష్టంలేక ఓ విద్యార్థిని పాఠశాల భవనం బాల్కనీ నుంచి దూకడంతో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతున్నది. ఈ ఘటన సంగారెడ్డి కల్పకుంట రోడ్డులో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాల(జోగిపేట)లో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకున్నది. పాఠశాల ప్రిన్సిపాల్ రజిని తెలిపిన వివరాల ప్రకారం.. పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న బాలిక అనారోగ్యం కారణంగా ఇరవై రోజుల క్రితం తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లారు. ఆరోగ్యం కుదుట పడటంతో బుధవారం మధ్యాహ్నం బాలికను తిరిగి పాఠశాలలో వదిలి వెళ్లారు. అయితే, ఆమెకు చదువుకోవడం ఇష్టం లేక మళ్లీ ఎలాగైనా ఇంటికి వెళ్లాలన్న ఆలోచనతో గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత ఆమె భవనం మొదటి అంతస్తులోని బాల్కనీ నుంచి దూకి గేటు సందులో నుంచి బయటికెళ్లింది. పాఠశాల ఎదుట ఉన్న ఇంటి తలుపులు తట్టి తాను తప్పిపోయి వచ్చానని యజమానికి చెప్పింది. ఇంటి యజమాని ఆరా తీయగా ఎదుటే ఉన్న గురుకుల పాఠశాల విద్యార్థిని అని తెలుసుకుని అధ్యాపకులు సమాచారమిచ్చారు. దీంతో, వారు గాయపడిన బాలికను తెల్లవారుజామున సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షల్లో కుడి కాలు మడమ ఎముకకు చీలిక ఏర్పడిందని తేలడంతో చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి అనుమానం లేదని బాలిక తల్లి చెప్పుకొచ్చారు. విషయం తెలుసుకున్న గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ ప్రభాకర్ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాలికను పరామర్శించారు. అనంతరం పాఠశాలను సందర్శించి వివారాలు తెలుసుకున్నారు. బీసీ గురుకులాల సెక్రటరీ సైదులు కూడా ఈ ఘటన గురించి విచారించినట్టు తెలిసింది.

పాస్‌బుక్ తనఖా లేకుండా రుణాలు

డీసీసీబీ మేనేజర్ కిషన్ జాదవ్



పాపన్నపేట, ఆగస్టు 23: పట్టాదారు పాస్‌బుక్ తనఖా లేకుండానే రైతులకు రుణాలు ఇస్తామని పాపన్నపేట డీసీసీబీ మేనేజర్ కిషన్‌జాదవ్ ప్రకటించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రూ.1.60 లక్షల రుణం వరకు మార్టిగేజ్ చేసుకోబోమన్నారు. కేవలం ధరణి చార్జి క్రియేషన్ చేసి రుణం ఇస్తామని చెప్పారు. అసైన్డ్ భూములకు కూడా రుణాలు ఇస్తామని తెలిపారు. రైతు నేస్తం పథకం ద్వారా ఎకరానికి రూ.2 లక్షల రుణం అందిస్తామన్నారు. లాంగ్‌టర్మ్ లోన్ కింద ఎకరానికి రూ.4 లక్షల చొప్పున పౌల్ట్రీ, డెయిరీ, షీప్ ఫామ్‌లకు రుణాలు ఇస్తామని తెలిపారు. తమ బ్యాంకు పరిధిలో రూ.5.50 కోట్ల రుణాలు మాఫీ కాగా, ఇప్పటివరకు రూ.4.50 కోట్లు తిరిగి రుణాలుగా ఇచ్చామన్నారు. రైతులు వెంటనే బ్యాంక్‌కు వచ్చి రుణాలు తీసుకోవాలని కోరారు. డిపాజిట్లపై ఇతర బ్యాంక్‌ల కన్నా ఎక్కువ వడ్డీ ఇస్తామన్నారు. ఏడేళ్ల తర్వాత చీకోడ్ సొసైటీ పరిధిలో ఎల్‌టీ లోన్లు ఇచ్చినట్లు చెప్పారు. ఆయన వెంట చీకోడ్ సొసైటీ చైర్మన్ దత్తరాజ్ ఉన్నారు.

స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

-జిల్లా అదనపు డీఆర్డీవో సరస్వతి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు డీఆర్డీవో సరస్వతి

మనోహరాబాద్, ఆగస్టు 23: మహిళలు స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు డీఆర్డీవో సరస్వతి అన్నారు. శుక్రవారం మనోహరాబాద్‌లోని సమైక్య కార్యాలయంలో సీసీలతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. మహిళలు రుణాలు పొంది ఆర్థికంగా ఎదగాలన్నారు. సకాలంలో రుణాలు చెల్లించే విధంగా చూడాలని, మహిళలు సీఐఎఫ్ ద్వారా రుణాలు తీసుకునే విధంగా వారికి సహకరించాలని కోరారు. తీసుకున్న రుణాలు వివరాలు ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని కోరారు. అనంతరం మండలంలో రుణాలు పొందిన మహిళల షాపులను తనిఖీ చేశారు. సమావేశంలో ఏపీఎం పెంటాగౌడ్, సీసీలు కృష్ణవేణి, మంజుల, విజయలక్ష్మి పాల్గొన్నారు.

భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలి

డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావు

వెల్దుర్తి, ఆగస్టు 23 : అన్ని గ్రామాల్లో నీటి నిల్వ గుంతలు ఏర్పాటు చేసి భూగర్భ జలాల పెంపు కోసం కృషి చేయాలని డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం వెల్దుర్తి మండల పరిషత్ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తప్పకుండా ప్రతి గ్రామంలో 2 ఎకరాల మేర పండ్ల తోటలు సాగు చేయాలని సూచించారు. అంతకుముందు వెల్దుర్తి మండల సమైక్య కార్యాలయంలో ఏపీఎం శంకరయ్యతో కలిసి వీవోఏ, సీసీలతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు లింకేజ్, స్త్రీనిధి, మైక్రో ఎంటర్ప్రైజెస్, బ్యాక్ యాడ్ పౌల్ట్రీ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ తదితర అంశాలపై చర్చించారు.

రైతులను విస్మరించిన బీఆర్‌ఎస్



గుమ్మడిదలలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

గుమ్మడిదల, ఆగస్టు 23 : గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులను విస్మరిస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసి చూపించిందని రాష్ట్ర పీసీసీ కార్యవర్గ సభ్యుడు కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు పుట్ట నర్సింగరావు, వడ్డే కృష్ణ, మాజీ మండల అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, మద్ది వీరారెడ్డి, మాజీ ఎంపీటీసీ సురభి నాగేందర్‌గౌడ్, మండల నాయకులు మద్ది ప్రతాపరెడ్డి, నరేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. గుమ్మడిదలలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేవలం రాజకీయ ఉనికి కోసమే బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు రైతుల పేరుతో ధర్నాలు చేస్తూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. రైతు రుణమాఫీ చేయలేదని బీఆర్‌ఎస్ నాయకులు నియోజకవర్గ స్థాయిలో గుమ్మడిదలలో ధర్నా పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. కొన్ని టెక్నికల్ ప్రాబ్లం వల్ల కొందరికి రుణమాఫీ కాకపోవచ్చు అన్నారు. రైతులు అధైర్య పడోద్దని రుణమాఫీ పూర్తి స్థాయిలో జరిగే విధంగా సహకరిస్తామని భరోసా ఇచ్చారు. రుణమాఫీపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నేతలు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తులసీదాసు, నాయకులు లక్ష్మారెడ్డి, పెంటారెడ్డి, నరసింహులు, యాదగిరి, దయాకర్ రెడ్డి, జంగారెడ్డి, అంజాద్ భాష, జైపాల్‌రెడ్డి, ఆకుల ఆంజనేయులు, కవ్వం రవీందర్‌రెడ్డి, రాజిరెడ్డి, విప్ప భూపతిరెడ్డి, విప్ప రామ్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వాచ్‌మన్‌పై విద్యార్థుల రాళ్ల దాడి

● స్వల్ప గాయాలు.. తప్పించుకున్న ఉపాధ్యాయులు



రాళ్ల రువ్వడంతో గాయపడిన వాచ్‌మన్ వెంకటయ్య

కౌడిపల్లి, ఆగస్టు 23: ఆకతాయి విద్యార్థులు రాత్రివేళలో వాచ్‌మన్‌తో పాటు ఉపాధ్యాయులపై రాళ్లు విసిరిన సంఘటన మండల పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని తునికిలోని మహత్మ జ్యోతిబా పూలే(ఎంజేపీ) గురుకుల పాఠశాలలో విద్యార్థులకు రాత్రివేళల్లో ఇబ్బందులు ఉండకూడద ని గురువారం రాత్రి వాచ్‌మన్ వెంకటయ్యతో కలసి ఉపాధ్యాయులు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇది గమనించిన కొంతమంది డిగ్రీ, ఇంటర్ చదువుత్ను విద్యార్థులు చెట్ల చాటు నుంచి రాళ్లను విసిరారు. వెంటనే ఉపాధ్యాయులు, వాచ్‌మన్ వెంకటయ్య అక్కడి నుంచి తప్పించుకునేందుకు యత్నించారు. ఈ క్రమంలో వాచ్‌మెన్‌కు ముఖానికి, వీపుకు స్వల్ప గాయలు అయ్యాయి. శుక్రవారం ఉదయం వాచ్‌మెన్ స్థానిక ఆర్ఎంపీ వైద్యుని వద్దకు వెళ్లి చికిత్స చేయించుకున్నారు. పాఠశాల ఆవరణలో వీది దీపాలు ఏర్పాటు చేస్తే విద్యార్థులు గోడ దూకి బయటకు వెళ్లే సమయంలో కనిపిస్తామని, కొంత మంది ధూమపానంతో పాటు ఇతర వ్యసనాలకు అలవాటుపడ్డారని, దొరికిపోతామని రాళ్లతో దాడికి పాల్పడి ఉంటారని వాచ్‌మన్ అనుమానం వ్యక్తం చేశారు. ఇదే విషయంపై ప్రిన్సిపాల్ హరిబాబును వివరణ కోరగా తమ పాఠశాలలో అలాంటిదేమీ జరగలేదని, తన దృష్టికి సమస్య రాలేదని దాటవేశారు.

బైక్‌పై శుభకార్యానికి వెళ్లి వస్తూ..

చెట్టును ఢీకొని ఒకరి మృతి



చెట్టుకు ఢీకొన్న ద్విచక్రవాహనం, పక్కనే మృతుడు స్వామి

గజ్వేల్, ఆగస్టు 23 : శుభకార్యానికి వెళ్లి వస్తూ బైక్ చెట్టును ఢీకొనడంతో ఒకరు మృతిచెందిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకున్నది. గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్ గ్రామానికి చెందిన శేరుపల్లి స్వామి(40) మిరుదొడ్డి మండలం కాసులాబాద్ గ్రామంలో శుభకార్యానికి తన ద్విచక్రవాహనంపై వెళ్లాడు. గురువారం రాత్రి తిరిగి తన స్వగ్రామం ప్రజ్ఞాపూర్‌కు వస్తుంటే గజ్వేల్ మండలం కొల్గూరు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్వామి అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. స్వామి భార్య శేరుపల్లి రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా తెలిపారు. మృతదేహాన్ని గజ్వేల్ ఏరియా ఆసుపత్రికి తరలించి, శవపరీక్షల అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

గంజాయి తాగి పట్టుబడిన ఇద్దరు యువకులు

ములుగు, ఆగస్టు 23: గంజాయి తాగి ఇద్దరు పట్టుబడిన ఘటన గురువారం రాత్రి ములుగు పరిధిలో చోటుచేసుకున్నది. గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి ములుగులో ఆసుపత్రి వెనుక వైపు కోళ్లఫారం వద్ద స్వామి, సురేశ్ అనుమానంగా కనిపించడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్న ఇద్దరికి నార్కోటిక్ టెస్ట్ చేయగా వారు గంజాయి తాగినట్లు తేలింది. వారిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. గంజాయి తాగి పట్టుబడినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ మహేందర్‌రెడ్డి హెచ్చరించారు. ఆయన వెంట ఎస్ఐ విజయ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

దొంగల హల్‌చల్..

నిలిపి ఉంచిన కారు టైర్లు చోరీ



టైర్లు దొంగతనం చేసిన కారు

నిజాంపేట, ఆగస్టు 23 : పార్కింగ్ చేసిన వాహనాల టైర్లు చోరీ చేసిన సంఘటన నిజాంపేట మండల కేంద్రంలో చోటుచేసుకున్నది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో చేర్వీరాల సురేష్, పంజా మహేందర్, గడ్డం శ్రీనివాస్‌కు చెందిన మూడు కార్లను వారి ఇంటి వద్ద పార్కింగ్‌కు స్థలం లేకపోవడంతో గాంధీ విగ్రహం సమీపంలో, అలాగే రహదారి పక్కన నిలిపారు. ఎప్పటిలాగే ఉదయం వాహనాల వద్దకు వచ్చి చూసేసరికి కార్ టైర్ల స్థానంలో రాళ్లు ఉంచి టైర్లలను ఎత్తుకెళ్లడంతో కంగుతిన్నారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి క్లూస్ టీం ద్వారా పరిశీలించి దర్యాప్తు చేపడుతున్నట్లు ఏఎస్ఐ జైపాల్‌రెడ్డి తెలిపారు.

వర్షాలకు కూలిన ఇంటిపైకప్పు

● ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడి వేడుకోలు

నిజాంపేట, ఆగస్టు 23 : ఇటీవల కురిసిన వర్షాలకు ఇంటిపై కప్పు కూలిపోవడంతో ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు శుక్రవారం అధికారులకు మొరపెట్టుకున్నారు. బాధితులు తెలిపిన ప్రకారం.. రెండు, మూడు రోజుల పాటు వేళలో కురుస్తున్న వర్షాల కారణంగా మండల పరిధిలోని రాంపూర్ గ్రామానికి చెందిన కేశవుల స్వామి ఇంటిపై కప్పు గురువారం రాత్రి ఒక్కసారిగా కుప్పకూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ విషయాన్ని బాధితులు శుక్రవారం స్థానిక తహసీల్దార్‌కు తెలపగా పరిశీలించి పైఅధికారులకు తెలుపుతామన్నారు. తమది నిరుపేద కుటుంబమని, ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

ఎనిమిది నెలల తర్వాత..

తల్లిదండ్రుల చెంతకు దివ్యాంగుడు

శివ్వంపేట, ఆగస్టు 23 : ఎనిమిది నెలల క్రితం పెదనాన్న ఇంటికి వచ్చి తప్పిపోయిన మానసిక దివ్యాంగుడిని పోలీసులు ఆశ్రమంలో చేర్పించగా ఆపరేషన్ ముస్కాన్ ద్వారా ఎనిమిది నెలల తర్వాత తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణానికి చెందిన మెరుగు గాడ్సన్ జాషవా మొదటి కుమారుడు బ్లెస్సెన్ రాజు ఈ ఏడాది జనవరిలో హైదరాబాద్ గాంధీనగర్‌లో ఉండే వాళ్ల పెదనాన్న ఇంటికి వచ్చాడు. బ్లెస్సెన్ రాజు జనవరి చివరి వారంలో తప్పిపోగా ఫిబ్రవరి 2వ తేదీన తూప్రాన్ పోలీసులకు దొరికాడు. తూప్రాన్ పోలీసులు శివ్వంపేట మండలం బేతాని సంరక్షణ అనాథ ఆశ్రమంలో ఆ బాలుడిని చేర్పించారు. కాగా పోలీసులు నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా దర్పన్ యాప్‌లో బాలుడి వివరాలను నమోదు చేశారు. తల్లిదండ్రులు గుర్తించడంతో 8 నెలల తర్వాత బాలుడిని క్షేమంగా తూప్రాన్ ఎస్ఐ శివనాదం సమక్షంలో ఆశ్రమ నిర్వాహకులు ఫాదర్ సాజీ వర్గీస్, ఆశ్రమ క్యాపస్ ఇన్‌చార్జి విన్సెంట్, సోషల్ వర్కర్ వీర బాబు, హోం ఇన్‌చార్జి సిస్టర్ కార్మెల్ తల్లిదండ్రులకు అప్పగించారు.

అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టివేత



పోలీసులు పట్టుకున్న పీడీఎస్ బియ్యం

మిరుదొడ్డి, ఆగస్టు 23 : అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్ తరలించినట్టు అక్బర్‌పేట-భూంపల్లి ఎస్ఐ హరీష్ తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాక మండలం పెద్దచీకోడ్ గ్రామానికి చెందిన పర్వతం యాదగిరి పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే నమ్మదిగిన సమాచారంతో పోలీస్‌స్టేషన్ ఎదుట శుక్రవారం తెల్లవారుజామున వాహనాలను తనిఖీ చేపట్టారు. బొలెరో వాహనంలో తరలిస్తున్న 49 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

బోడ కాకరకు బోలెడు డిమాండ్



మార్కెట్‌లో బోడ కాకర



● హాట్‌కేక్‌లా అమ్ముడవుతున్న కూరగాయ

● కిలో రూ.250 వరకు విక్రయం



హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 23 : వర్షాకాలంలో మాత్రమే లభించే కూరగాయల్లో బోడ(అడవి) కాకర ఒకటి. అడవుల్లో, గుట్ట ప్రాంతాలు, వాగులు, చెరువు గట్ల వెంట ఎక్కువగా లభించే వీటిల్లో ఔషధగుణాలతో పాటు పోషక విలువలు అధికంగా ఉంటాయి. వర్షాకాలంలో మాత్రమే లభించే బోడ కాకరను తినేందుకు మహా ఇష్టపడతారు. గ్రామాల్లో బోడ కాకర ఉత్పత్తి తగ్గిపోవడంతో ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. మరి ఇంకా శ్రావణ మాసంలో బోడకాకర కూరకు డిమాండ్ బాగా పెరిగింది. మార్కెట్‌లోకి తీసుకు రావడమే ఆలస్యం వినియోగదారులు ఎగబడి కొంటున్నారు. కిలో రూ.200 నుంచి 250 వరకు విక్రయిస్తున్నారు.



హుస్నాబాద్ సంతలో బోడ కాకర విక్రయం

హైదరాబాద్ టూ హుస్నాబాద్‌కు దిగుమతి



గ్రామీణ ప్రాంతాల్లో బోడకాకర కనుమరుగైపోతుండడంతో ప్రత్యామ్నాయంగా హైదరాబాద్ నుంచి సీడ్ వంగడం బోడ కాకరకాయ హుస్నాబాద్‌కు దిగుమతి అవుతోంది. దీనిపై వినియోగదారులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. అదే లోకల్ బోడకాకరకాయ కోసం వినియోగదారులు ఎగబడుతున్నారు. గిరిజన తండాల నుంచి తెచ్చే బోడకాకర హాట్‌కేక్‌లా అమ్ముడు పోతున్నది.

- నేతి రవీందర్, కూరగాయల అమ్మకందారుడు, హుస్నాబాద్

గ్రామాల్లో అంతరిస్తున్న బోడ కాకర

గ్రామీణ ప్రాంతాల్లో సహజసిద్ధంగా దొరికే బోడ కాకర ప్రస్తుతం అంతరించిపోతుంది. ఒకప్పుడు బోడ కాకరను గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు తీసుకెళ్లి అమ్మేవారు. కానీ, ప్రస్తుతం పట్టణాల నుంచి పల్లెలకు బోడ కాకర దిగుమతి అవుతున్నది. అడవుల విస్తీర్ణం తగ్గిపోవడం, చెరువులు, కుంటల మరమ్మతుతో చెట్లు అంతరించిపోయి గ్రామాల్లో బోడ కాకర ఉత్పత్తి తగ్గిపోయింది. గ్రామాల్లో ఎక్కడో ఒక చోట లభించే బోడ కాకరను సేకరించి మార్కెట్లకు తరలిస్తే అరగంటలో అమ్ముడవుతున్నది. హుస్నాబాద్ డివిజన్‌లోని అక్కన్నపేట, కోహెడ, హుస్నాబాద్ చుట్టుపక్కల ఉన్న గిరిజన తండాల్లో ఎక్కువగా లభిస్తాయి. కొందరు గిరిజనులు వీటిని కోసి ప్రతీ శుక్రవారం హుస్నాబాద్‌లో నిర్వహించే సంతకు తెస్తారు. సంతలో హాట్‌కేక్‌ల్లా అమ్ముడవుతున్నాయి.



సహజ సిద్ధంగా అడవిలో పెరిగిన బోడ కాకరకాయ తీగ

ఆర్వోఆర్‌పై సూచనలను ప్రభుత్వానికి నివేదిస్తాం

● సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి

● జవాబుదారితనంతో కూడిన వీఆర్‌వో వ్యవస్థను మళ్లీ ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి



మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 23 : తెలంగాణ నూతన ఆర్వోఆర్(రికార్డ్ ఆఫ్ రైట్) 2024 ముసాయిదా బిల్లుపై అవగాహన కల్పించి సలహాలు, సూచనలు తీసుకున్నామని సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి తెలిపారు. వీటిని రికార్డు చేశామని, ఆ వివరాలను ప్రభుత్వానికి అందజేస్తామని ఆయన తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన ఆర్వోఆర్ 2024 ముసాయిదా బిల్లుపై చర్చవేదిక నిర్వహించారు. ముందుగా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, దుబ్బాక తహసీల్దార్ వెంకటరెడ్డి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నూతన ముసాయిదా బిల్లులోని 20 అంశాలను వివరించారు. ఈ సందర్భంగా అడ్వకేట్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు, జర్నలిస్టులు, ట్రెసా (తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్) ప్రతినిధులు మాట్లాడారు. కొత్త చట్టంలో భూ రికార్డులు ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ ఉంచాలని, రైతు కుటుంబం కోరారు. లీగల్ విల్ డీడ్ చేసినప్పుడు దానినే ప్రామాణికంగా చేసుకొని రిజిస్ట్రేషన్ చేయాలని, ప్రైవేటు భూములతో పాటు ప్రభుత్వ భూములకు, దేవాదాయ భూములకు కూడా కాస్తుదారు ఉండాలని, రెవెన్యూ అధికారులు వివిధ పనులతో బిజీగా ఉంటారు కాబట్టి భూముల రిజిస్ట్రేషన్ వ్యవహారాలు సబ్ రిజిస్ట్రార్ల ద్వారా మాత్రమే జరిగేలా చూడాలని సూచించారు. సవరణ రిజిస్టర్ ప్రజలకు అందుబాటులో ఉంచాలని, హిడెన్ ఫైల్స్ ఉండరాదని, ధరణిలో జరిగిన పొరపాట్లను ఆర్డీవో ద్వారా పరిశీలించి సరి చేసే అధికారం కల్పించాలని పలువురు సూచించారు. భూ సమస్యల శాశ్వత పరిష్కార వేదికను జిల్లాస్థాయిలో ఏర్పాటు చేయాలని కోరారు. జవాబుదారీతనంతో కూడిన వీఆర్వో వ్యవస్థను మళ్లీ ప్రవేశపెట్టాలని వారు కోరారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ రికార్డులపై అజమాయిషీ తహసీల్దార్ వద్దనే ఉండాలని, రికార్డ్స్ కరెక్షన్ ఆప్షన్ ఆర్డీవోకు ఇవ్వాలని, విల్ డీడ్ చేసినప్పుడు సాక్షులను విచారించి రిజిస్ట్రేషన్ చేయాలని తెలిపారు. మున్సిపల్ ప్రాంతాల్లో నాలాలు చెరువులు కబ్జాకు గురికాకుండా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ మ్యాపులు రూపొందించాలని, అప్పీల్ అధికారాలు ఆర్డీవోకు, అదనపు కలెక్టర్‌కి పెట్టాలని, రెవెన్యూ కోర్టులకు బదులుగా రిటైర్డ్ జడ్జిలు లేదా రిటైర్డ్ కలెక్టర్లు లేదా రిటైర్డ్ జాయింట్ కలెక్టర్లతో ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని కోరారు. ఆర్వోఆర్ యాక్టును ధరణి రిఫరెన్స్‌కు బదులుగా 2017 రికార్డు ప్రకారం రూపొందించాలని, వివాదాస్పద అంశాలను నిర్ణీత సమయంలోనే పరిష్కరించాలని, ఇప్పుడున్న సాదాబైనామా కేసులను ఆరు నెలల్లో పరిష్కరించి కొత్తవి జరగకుండా చూడాలని సూచించారు. ఎస్ఐసీ ద్వారా ఆర్వోఆర్ చట్టాన్ని అమలు చేయాలనే తదితర, సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ ఆర్డీవోలు సదానందం, బన్సీలాల్, రామ్మూర్తి, కలెక్టరేట్ ఏవో రెహమాన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, బార్ అసోసియేషన్ సభ్యులు, ట్రెసా సభ్యులు, జర్నలిస్టులు, ప్రజలు, రెవెన్యూ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పన్నులు పెంచితే సహించేది లేదు

● పౌరసేవలకు ఇబ్బందులు రాకుండా చూడాలి

● అభిప్రాయం వ్యక్తపరిచిన పటేల్‌గూడ, కిష్టారెడ్డిపేట గ్రామస్థులు

● మున్సిపాలిటీలో విలీనంపై ప్రజాభిప్రాయ సేకరణ



కిష్టారెడ్డిపేట గ్రామంలో ప్రజాభిప్రాయం సేకరిస్తున్న అధికారులు

పటాన్‌చెరు, ఆగస్టు 23 : గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేసి, పన్నులు పెంచుతామంటే సహించేది లేదని గ్రామ పంచాయతీలోని ప్రజలు తేల్చిచెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని పలు గ్రామ పంచాయతీలను పక్కనే ఉన్న అమీన్‌పూర్ మున్సిపాలిటీలో విలీనం చేయడంపై జిల్లా పంచాయతీరాజ్ అధికారులు ఆయా గ్రామాల్లో గ్రామసభలను నిర్వహిస్తున్నారు. శుక్రవారం మండల పరిధిలోని పటేల్‌గూడ, కిష్టారెడ్డిపేట తదితర గ్రామ పంచాయతీల్లో గ్రామసభలను నిర్వహించి ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. మాజీ ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు, ఆయా కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు, యువత సభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇంకా కొన్ని రోజులు పంచాయతీలుగానే కొనసాగించి మౌలిక వసతులు అభివృద్ధి పరచాలని కోరారు. కాగా కొందరు మాత్రం పంచాయతీని అప్‌గ్రేడ్ చేసి మున్సిపాలిటీలో విలీనం చేస్తే నిధులు పెద్దఎత్తున రావడం ద్వారా అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. మున్సిపాలిటీగా మారినా పౌరసేవలకు ఇబ్బందులు రాకుండా చూడాలని, గ్రామంలో వార్డు కార్యాలయం ఏర్పాటు చేసి ఇక్కడే సేవలు అందించాలని కోరారు. గ్రామ సభల తీర్మానాలు, అభ్యంతరాలను కలెక్టర్‌కు నివేదిస్తామని పంచాయతీ ప్రత్యేకాధికారులు, ఈవోలు హామీ ఇచ్చారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం అందించాలి

● మెదక్ డీఎంహెచ్‌వో శ్రీరామ్

మెదక్ కల్చరల్, ఆగస్టు 23 : పేదల ప్రజలపై ఆర్థిక భారం పడకుండా, తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్య సేవలను అందించాలని జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులతో డీఎంహెచ్‌వో శ్రీరామ్ సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రైవేటు ఆస్పత్రి వైద్యులతో శుక్రవారం డీఎంహెచ్‌వో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రుల్లో ప్రతీ ఒక్కరు వివరాలతో కూడిన బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. డెంగ్యూ పరీక్షలలో ఎన్ఎస్ వన్ పాజిటివ్ వస్తే టీ హబ్‌లో ఎలిసా టెస్ట్ చేయించి నిర్ధారించాలని అన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే, అనుమతులు లేకుండా ఆస్పత్రులు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకొని హాస్పిటల్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. స్కానింగ్ వివరాలు ఎప్పటికప్పుడు పంపించాలని అన్నారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్ నవీన్‌కుమార్, డెమో శ్రీనివాస్, రమ, ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు పాల్గొన్నారు.



వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

కుల బహిష్కరణ ఘటనలో పలువురి

పెద్ద మనుషులపై కేసు నమోదు

దుబ్బాక/మిరుదొడ్డి, ఆగస్టు 23 : అక్బర్‌పేట-భూంపల్లి మండలం బొప్పాపూర్ గ్రామానికి చెందిన బండమీది సాయిలు మృతదేహానికి కుల బహిష్కరణ చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం బండమీది పోశవ్వ భూంపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గవ్వల చంద్రయ్య, కొనాపురం శ్రీనివాస్, మారి చంద్రయ్య, గవ్వల పెంటయ్య, ఎనగుర్తి పద్మయ్య, దుంపలపల్లి స్వామిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ఉద్యోగుల శ్రమను దోపిడీ చేసే సీపీఎస్‌ను రద్దును చేయాలి

● తొగుటలో నల్లబ్యాడ్జీలు ధరించి వివిధ సంఘాల ఉపాధ్యాయుల నిరసన



గజ్వేల్ ఐవోసీ కార్యాలయంలో జీవో నంబర్ 28 ప్రతులను దహనం చేస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

తొగుట, ఆగస్టు 23 : ఉద్యోగ, ఉపాధ్యాయుల శ్రమను దోపిడీ చేస్తూ తీసుకొచ్చిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, వెంటనే ఓపీఎస్ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తొగుట ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు తన మేనిఫెస్టోలో సీపీఎస్ రద్దు చేసి, ఓపీఎస్‌ను అమల్లోకి తెస్తామని ప్రకటించిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలైనా ఇప్పటివరకు ఎలాంటి కార్యాచరణను చేపట్టకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌లను వెంటనే అమలుచేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తొగుట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపేందర్, ఉపాధ్యాయులు మల్లేశం, భగవాన్, శ్రీపాల్, శ్రీనివాస్, రాములు, అన్నపూర్ణ, అనురాధ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జీవో 28 ప్రతులను దహనం

గజ్వేల్, ఆగస్టు 23 : ఉద్యోగుల పాతపెన్షన్ విధానాన్ని కాలరాసి జీవో నంబర్ 28ను అమలులోకి తీసుకొచ్చి నూతన పెన్షన్ స్కీంకు శ్రీకారం చుట్టిన ఆగస్టు 23 బ్లాక్ డే అని ఉద్యోగ సంఘాల నాయకులు అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఐవోసీ కార్యాలయంలో జీవో 28 ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎస్ ఈయూ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మల్లికార్జున్, జిల్లా ఉపాధ్యక్షుడు వై.రాజు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మండల అధ్యక్షుడు షేక్ బిలాల్, కమలాకర్, లవకుమార్, మల్లేశం, అశ్రఫ్, ఉపేంద్రం నరేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో గిరిజన గురుకులం

● పాతబడిన భవనంలోనే తరగతులు

● భయంభయంగా చదువుతున్న విద్యార్థులు

నర్సాపూర్, ఆగస్టు 23 : గిరిజనులకు నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశంతో 30 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన గిరిజన గురుకుల విద్యాలయం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. కూలుతున్న పాత భవనంలోనే తరగుతులు కొనసాగుతుండడంతో విద్యార్థులు భయంభయంగా విద్యనభ్యసిస్తున్నారు. ఇదీ నర్సాపూర్ మండలం మహ్మదాబాద్ గిరిజన ఆశ్రమ పాఠశాల దుస్థితి. ఈ పాఠశాలలో 3వ తరగతి నుంచి పదోతరగతి వరకు కొనసాగుతున్నది. విద్యాలయంలో సంగారెడ్డి, మెదక్ జిల్లాలోని గిరిజన విద్యార్థులు 167 మంది ఉన్నారు. ఈ గిరిజన పాఠశాల మండలంలోని ఓ మారుమూల ప్రాంతంలో ఉండటంతో అటు ప్రజాప్రతినిధులు ఇటు అధికారులు పట్టించుకోకపోవడంతో దాని పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది.



తలుపులు, కిటికీలు లేని తరగతి గది



ఎప్పుడు కూలుతుందో..

30 ఏళ్ల క్రితం విద్యార్థులు చదువుకోవడానికి తరగతి గదులతో ఓ భవనాన్ని, నివాసముండటానికి డార్మెంటరీ హాలును నిర్మించారు. ఈ రెండు భవనాలు ఐదేళ్ల క్రితమే శిథిలావస్థకు చేరింది. నాలుగేళ్ల క్రితం కొత్తగా హాస్టల్ భవనం, భోజనం చేయడానికి ఓ గది నిర్మించారు. తరగతి గదులను మాత్రం నిర్మించలేదు. బోధనకు పాతబడిన భవనమే దిక్కైంది. పైకప్పు పెచ్చులూడుతూ కిటికీలు, తలుపులు కూడా లేని అధ్వానమైన గదులలోనే విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువు సాగిస్తున్నారు. కిటికీలు ఊడిపోయి గోడ కూలి పెద్దపెద్ద రంధ్రాలు ఏర్పడ్డ పట్టించుకునే నాథుడే లేడు.





మహ్మదాబాద్ గిరిజన విద్యాలయం, పెచ్చులూడుతున్న భవనం

ఒక్క రెగ్యులర్ ఉపాధ్యాయుడు లేరు

ఈ గిరిజన పాఠశాలలో మొత్తం 11 మంది ఉపాధ్యాయులు ఉండగా అందులో పది మంది విద్యావలంటీర్లుగా పనిచేస్తున్న వారే. హెచ్ఎం కూడా కాంట్రాక్ట్ ఉద్యోగి. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా ఎవరూ దీనిపై దృష్టి పెట్టకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆర్ఆర్ఆర్ ప్రతిపాదిత భూముల పరిశీలన



కాసాల గ్రామ శివారులో రీజనల్ రింగ్ రోడ్డు భూములను పరిశీలిస్తున్న అధికారులు

హత్నూర, ఆగస్టు 23: మండలంలోని పలు గ్రామాల శివారులను ఆనుకొని ట్రిబుల్ఆర్ రోడ్డు ప్రాంతాలను శుక్రవారం అధికారులు పరిశీలించారు. మండలంలోని దౌల్తాబాద్, సికింద్లాపూర్, దేవులపల్లి, కాసాల, గ్రామాల శివారు గుండా వెళ్లే రీజినల్ రింగ్ రోడ్డు ప్రాంత భూములను ఆర్అండ్బీ డీఈ రవీందర్, ఆర్ఐ శ్రీనివాస్, సర్వేయర్ శ్రీనివాస్‌తో కూడిన బృందం పరిశీలించారు. రోడ్డు నిర్మాణం కోసం ప్రతి పాదనలు తయారు చేసేందుకోసం పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన నివేదికను ఉన్నతస్థాయి అధికారులకు అందించనున్నట్లు తెలిపారు.

ఎస్పీఎఫ్ పటిష్టపరిచేందుకు అధునాతన శిక్షణ



అమీన్‌పూర్ ఎస్పీఎఫ్ అకాడమీలో వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఐజీ మాధవరావు

పటాన్‌చెరు, ఆగస్టు 23: ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో పోలీస్ ప్రొటెక్షన్ ఫోర్స్ సెల్ కీలకపాత్ర పోశిస్తుందని, అందుకు అధునాతన శిక్షణ ఇస్తున్నామని అమీన్‌పూర్‌లోని తెలంగాణా ప్రొటెక్షన్ ఫోర్స్ అకాడమీ ప్రిన్సిపాల్, డీఐజీ ఆర్.మాధవరావు పేర్కొన్నారు. అకాడమీలో శిక్షణ అభ్యర్థులకు, సిబ్బందికి వైద్య శిబిరం నిర్వహించారు. మెడికవర్, మా ఈఎన్‌టీ, పార్థాడెంటల్, న్యూ రెటీనా ఆసుపత్రుల వైద్యుల బృందం సిబ్బందికి నేత్రపరీక్షలు నిర్వహించారు. అకాడమీలోని మొత్తం 300ల మంది శిక్షణ అభ్యర్థులు, పోలీసు అధికారులు, సిబ్బందికి పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ప్రారంభించిన డీఐజీ మాట్లాడుతూ.. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్)ను మరింత పటిష్టం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనా విధానానికి అనుగుణంగా ఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ అనిల్‌కుమార్ పర్యవేక్షణ, నేతృత్వంలో అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అకాడమీ వైస్‌ప్రిన్సిపాల్ క్రిష్టయ్య, ఇన్‌స్పెక్టర్లు జి.సత్తయ్య, బి.రాజు, వి.శ్రీధర్‌గౌడ్, ఎం.నరేష్, మౌలానా పాల్గొన్నారు.

సైబర్‌క్రైం పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

- పలు మండలాల్లో ఆన్‌లైన్ మోసాలు, మత్తుపదార్థాల నివారణపై అవగాహన



కంది: వ్యవసాయ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న సైబర్‌క్రైం సెల్ డీఎస్పీ వేణుగోపాల్



జిన్నారం: బొల్లారం పోలీస్‌స్టేషన్‌లో అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ గంగాధర్

కంది, ఆగస్టు 23 : సైబర్‌క్రైమ్ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సైబర్‌క్రైమ్ సెల్ డీఎస్పీ వేణుగోపాల్ పేర్కొన్నారు. కంది పరిధిలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఆయన విద్యార్థులకు సైబర్‌నేరాల ఉచ్చులో చిక్కుకోకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ.. అనుమానాస్పదంగా ఎస్ఎంఎస్‌ల ద్వారా ఫోన్లకు వచ్చిన లింకులను ఓపెన్ చేయవద్దని సూచించారు. విద్యార్థులు మాదకద్రవ్యాల పట్ల జాగ్రత్తగా ఉంటూ, ఎలాంటి వ్యసనాలకు లోనుకావద్దని సూచించారు. కళాశాలల్లో ర్యాగింగ్ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలన్నారు. రైతులకు మేలు చేసేలా వ్యవసాయంలో సరికొత్త పరిశోధనలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల డీన్ మనోజ్‌కుమార్, సంగారెడ్డి రూరల్ సీఐ అశోక్ కుమార్, ఎస్ఐ వినయ్‌కుమార్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

- నారాయణఖేడ్: యువత, విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగాఉండాలని ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి సూచించారు. శుక్రవారం నారాయణఖేడ్‌ప్రభుత్వజూనియర్ కళాశాలలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మత్తుపదార్థాల నియంత్రణపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మత్తు పదార్థాలనునియంత్రించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాలనియంత్రణకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటరెడ్డి, లయన్స్‌క్లబ్ బాధ్యులు, అధికారులు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.
- జిన్నారం: సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియంత్రణపై బొల్లారం పోలీసులు పరిశ్రమలు, స్టోన్ క్రషర్ యాజమాన్యాలతో అవగాహన సమావేశం నిర్వహించారు. శుక్రవారం బొల్లారం పోలీస్‌స్టేషన్‌లో సీఐ గంగాధర్, ఎస్ఐ దశరథ్‌లు పరిశ్రమల సమాఖ్య అధ్యక్షుడు ఆనందరావు, కార్యదర్శి రాయుడు, ఇతర ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కార్మికులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్, మేసేజ్‌ల పట్ల జాగ్రత్త వహించాలని సీఐ వివరించారు. పారిశ్రామికవాడలో రహదారులు, పరిశ్రమల సమీపంలో వాహనాలు పార్కింగ్ చేయకుండా చూడాలన్నారు. స్టోన్ క్రషర్ల నుంచి వాహనాల్లో తరలించే కంకర రహదారులపై పారవేయకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పరిశ్రమల ప్రతినిధులు, స్టోన్ క్రషర్ల నిర్వాహకులు పాల్గొన్నారు.
- నర్సాపూర్: నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంటు సొసైటీ, ఎస్బీఐ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆన్‌లైన్ మార్కెటింగ్‌లో జరిగే మోసాలు, ఇంటర్‌నెట్ వినియోగించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దామోదర్, వైస్‌ప్రిన్సిపాల్ సమీరా, కె.రమేష్, శ్రీనివాస్, సౌజన్య, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం: కమిషనర్



శాంతినగర్‌లో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్‌కమిషనర్

జహీరాబాద్, ఆగస్టు 23: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఫ్రైడే- డ్రైడే సందర్భంగా పట్టణంలోని శాంతినగర్, తదితర ప్రాంతాల్లో పర్యటించి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి ఆవరణలో పెంచిన చెట్ల కింద కనీసం వారానికి ఒక రోజైన శుభ్రం చేసుకుంటే దోమలు, ఈగలు వృద్ధి చెందవన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంధ్య మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

- నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీపరిధిలోని 1వవార్డు పరిధిలో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ నర్సింహులు ఆధ్వర్యంలో మున్సిపల్ వైద్యశాఖ సిబ్బంది వార్డుల్లో ర్యాలీ నిర్వహించి, ఇంటింటికి వెళ్లి దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

ఓపెన్‌స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నారాయణఖేడ్,ఆగస్టు 23: ఓపెన్ స్కూల్ స్టడీసెంటర్‌లో ప్రవేశానికి 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రావు, అసిస్టెంట్ కోఆర్డినేటర్ దేవిసింగ్ కోరారు. శుక్రవారం మండల కేంద్రమైన నిజాంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఓపెన్‌స్కూల్ స్టడీ సెంటర్ ప్రవేశ పరీక్షపోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేసుకోవడం కోసం 18 సంవత్సరాలు నిండినవారు సెప్టెంబరు 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. నాన్ సైన్స్ గ్రూపులో మాత్రమే ప్రవేశాలు ఉంటాయన్నారు. పూర్తి వివరాల కోసం 9391644170 నెంబరులోసంప్రదించాలన్నారు.

పెద్దచెరువులోకి నీటి పంపింగ్

తూప్రాన్, ఆగస్టు 23: తూప్రాన్ పెద్దచెరువులోకి నీటి పంపింగ్‌ను శుక్రవారం చేపట్టారు. కొన్నేళ్లుగా పెద్ద చెరువు నిండకపోవడంతో హల్దీ వాగు నుంచి పెద్దచెరువులోకి లిఫ్టు ఇరిగేషన్ పథకం చేపట్టారు. వర్షాలు భారీగా కురిసి హల్దీవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పెద్దచెరువులోకి నీటిని పంపింగ్ చేస్తున్నారు. పెద్దచెరువు నిండేందుకు లిఫ్టు ఇరిగేషన్ మోటార్లు ఆన్ చేశారు. హల్దీవాగు చెక్‌డ్యాం నిండి ప్రవహిస్తున్న సమయంలో లిఫ్టు ఇరిగేషన్ పంపులు రన్ చేసి పెద్దచెరువులోకి నీటిని పంపింగ్ చేస్తుంటారు.

మహబూబ్‌సాగర్‌లో మృతి చెందిన చేపలను పరిశీలించిన ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్



వివరాలను అడిగి తెలుసుకుంటున్న రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 23: జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని కింది బజార్ మహబూబ్‌సాగర్ చెరువులో ఇటీవల మృతి చెందిన చేపలను రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సూచన మేరకు సంగారెడ్డికి వచ్చిన మెట్టు సాయికుమార్ స్థానిక గంగపుత్ర సంఘం ప్రతినిధులు, మత్స్యకారులతో పాటు పలువురు కాంగ్రెస్ కౌన్సిలర్లతో కలిసి మహబూబ్ సాగర్ చెరువు వద్దకు వెళ్లి మృతి చెందిన చేపలను పరిశీలించారు. ఈ సందర్భంగా మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ ఈ చెరువులో గత ఏడాది 5లక్షలు చేప పిల్లలు వదిలితే చెరువులో గుర్రపు డెక్క, పట్టణంలోని మురికి నీటితో కలుషితమై దాదాపు 3లక్షల చేపలు మృతి చెందినట్లు గుర్తించామన్నారు. చేపలపై ఆధారపడిన 500 గంగపుత్రుల కుటుంబాలకు తీరని నష్టం వాటిల్లిందని ఆందోళన వ్యక్తం చేశారు. మత్స్యకారులు అధైర్య పడొద్దని, ఈ విషయాన్ని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ద్వారా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నష్ట పరిహారం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కూన సంతోష్, గంగపుత్ర సంఘం ప్రధాన కార్యదర్శి కిష్టయ్య, కడబోయిన అంజనేయులుచ కూన కొండల్, మత్స్య సహకార సంఘం కార్యదర్శి చిదంబర సాయి, డైరెక్టర్లు రాజేష్, నర్సింహారాజు, దశరథ్, రాజు, కూన వేణు, రమేష్, రాఘవేందర్, సాయి, కౌన్సిలర్ వెంకట్ రాజు పాల్గొన్నారు.

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి



ఎస్వీ కాలేజీలో మాట్లాడుతున్న యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 23: వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని యువజన సంఘాలసమితి రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణుగోపాలకృష్ణ సూచించారు. సంగారెడ్డిలోని ఎస్వీ జూనియర్ కళాశాలలో వినియోగదారుల అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృతశ్రీ మాట్లాడుతూ కలర్ ఫుడ్ ఐటెమ్స్‌కు ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు. లీగల్ మెట్రాలజీ జిల్లా అధికారి అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు వస్తువులు విక్రయిస్తే ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. తూనికలు కొలతల్లో జరుగుతున్న మోసాలు, వినియోగదారుల హక్కులను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఫ్యూయల్ డ్రాప్ సీఈవో రాధాకృష్ణ, యూనియన్ బ్యాంకు మేనేజర్ సంగీత, కౌన్సిల్ మెంబర్ ధర్మరాజు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

వీధి ఆహార వ్యాపారులు పరిశుభ్రత పాటించాలి

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 23: సంగారెడ్డిలోని మున్సిపల్ కార్యాలయంలో వీధి ఆహార వ్యాపారుల శిక్షణ కార్యక్రమం మూడోరోజైన శుక్రవారం కొనసాగింది. నేషనల్ అసోసియేషన్ ఆఫ్ స్ట్రీట్ వెండర్స్ ఆఫ్ ఇండియా(ఎన్ఏఎస్‌వీఐ)ఆధ్వర్యంలో ఫుడ్‌సేఫ్టీ, మున్సిపల్‌శాఖ సౌజన్యంతో నెస్లే వారి సహకారంతో వీధి ఆహార వ్యాపారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృతశ్రీ వీధి వ్యాపారులు ఆహార విక్రయాల్లో కచ్చితంగా నిబంధనలు, పరిశుభ్రత పాటించాలంటూ పలు సూచనలు చేశారు. శిక్షణ కార్యక్రమంలో వంద మంది పాల్గొన్నారు. శనివారంతో శిక్షణ కార్యక్రమాలు ముగుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అకౌంట్స్ మేనేజర్ కమల్, స్టేట్ కో ఆర్డినేటర్ ప్రసన్న, వసీం, భారతి, వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో ప్రజలకు ప్రయోజనం



జహీరాబాద్, ఆగస్టు 23: సీఎం సహాయనిధితో ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో 14మంది లబ్ధిదారులకు రూ.4.25లక్షల విలువ చేసే చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎక్కడైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ మశ్చందర్, జహీరాబాద్ మండలపార్టీ అధ్యక్షుడు తట్టునారాయణ, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కంది, ఆగస్టు 23 : కందిలోని 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం చేర్యాల, ఇంద్రకరణ్, మామిడిపల్లిలోని 33/11కేవీ సబ్‌స్టేషన్లకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏఈ ప్రకాశ్ ప్రకటనలో తెలిపారు. కంది, కవలంపేట, చేర్యాల, కాశీపూర్, కలివేముల, చెర్లగూడెం, తోపుగొండ, జుల్‌కల్, ఎద్దుమైలారం, ఆరుట్ల, చిద్రుప్ప, బేగంపేట, బ్యాతోల్, తునికిళ్ల తండా, ఉత్తర్‌పల్లి, మక్తా అల్లూరు గ్రామాల్లో ఉదయం 9నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

- పటాన్‌చెరు, ఆగస్టు 23: అమీన్‌పూర్ విద్యుత్‌సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ వెంకట్‌రాంరెడ్డి తెలిపారు. ఉదయం ఆర్ఆర్ హోమ్స్ ఫీడర్ పరిధిలో 10.30 నుంచి 11గంటల వరకు, బొల్లారం నుంచి వచ్చే పవన్ ఫీడర్ పరిధిలో 11నుంచి 11.30 వరకు, పీఎన్ఆర్‌హిల్స్ పరిధిలో 11.30 నుంచి 12గంటల వరకు, వెదిరి కాలనీ ఫీడర్ పరిధిలో 12నుంచి 12.30వరకు, అమీన్‌పూర్ గ్రామం ఫీడర్ పరిధిలో ఒంటి గంట నుంచి 1.30వరకు, బందం కొమ్ము ఫీడర్ పరిధిలో 11.30 నుంచి ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

బలగం నటుడి సోదరుడు మృతి

రామాయంపేట, ఆగస్టు 23: బలగం సినిమా నటుడు మురళీధర్ సోదరుడు ప్రభుత్వ టీచర్ ఐరేని రవీందర్‌గౌడ్ అనారోగ్యంతో చనిపోగా.. ఆ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పరామర్శించారు. రామాయంపేటలో శుక్రవారం జరిగిన అంత్యక్రియల్లో మైనంపల్లితో పాటు అన్ని పార్టీల నాయకులు, ప్రముఖులు, పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి: సంజీవరెడ్డి



కల్హేర్: ఎస్‌జీఎఫ్ క్రీడల్లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్, ఆగస్టు 23: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి సూచించారు. మండల పరిధిలోని మార్డి జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో 68వ పాఠశాలల ఎస్‌జీఎఫ్ క్రీడలను శుక్రవారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి క్రీడల జెండా ఎగురవేసి ప్రారంభించారు. అనంతరం సభలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో, మానసికోల్లాసానికి, దేహదారుఢ్యానికి క్రీడలు కూడా అంతే ముఖ్యమన్నారు. పాఠశాలల్లో క్రీడా సామగ్రితో పాటు పీఈటీ పోస్టుల భర్తీ చేస్తామన్నారు. సీఎం దూర దృష్టితో రాష్ట్రంలో క్రీడల శిక్షణ కోసం ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయించి ఒలింపిక్స్‌లో విజయాలు సాధించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇప్పుడు మెగా డీఎస్సీ ద్వారా మరో 15వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో సీడీసీ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి, ఎంఈవో శంకర్, పీజీహెచ్ఎం, జిల్లా పీఆర్టీయూ అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, అనియత విద్య జిల్లా ప్రొగ్రాం అధికారి వెంకటరెడ్డి, పీజీహెచ్ఎంలు, పీఈటీలు, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

నారాయణఖేడ్, ఆగస్టు 23: మహిళలు స్వయంశక్తితో ఆర్థికాభివృద్ధిసాధించాలని స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలోని ఆక్సిజన్‌పార్కులో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాంటిన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధి కోసం అనేక చర్యలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, కమిషనర్‌జగ్జీవన్, పలువురు కౌన్సిలర్లు, మాజీసీడీసీ చైర్మన్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలకత్తా ఘటనకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



సిరిపురంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

హత్నూర, ఆగస్టు 23: కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై లైంగిక దాడికి నిరసనగా మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో గురువారం రాత్రి స్థానిక యువకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

యూపీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 23 : సంగారెడ్డిలోని ఇంద్రనగర్ యూపీహెచ్‌సీని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. యూపీహెచ్‌సీలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందులు లభ్యత, పరీక్షల నిర్వహణపై ఆరా తీసి పలు రికార్డులు పరిశీలించారు అనంతరం పక్కనే ఉన్న ఆయుర్వేద, యునానీ, హోమియోపతి డిస్పెన్సరీలను సందర్శించారు.

ఎంపీడీవో కార్యాలయాన్ని జడ్పీ సీఈవో ..

పెద్దశంకరంపేట, ఆగస్టు 23: పెద్దశంకరంపేటలోని ఎంపీడీవో కార్యాలయాన్ని మెదక్ జిల్లా జడ్పీసీఈవో ఎల్లయ్య శుక్రవారం సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ప్రజాపాలన కేంద్రం పని తీరును పరిశీలించి మాట్లాడారు. ప్రజాపాలన కేంద్రంలో వచ్చే దరఖాస్తులను వెంట వెంటనే ఆన్‌లైన్ చేయాలని సూచించారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలను తప్పనిసరిగా అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఫీక్‌ఉన్నిసా, ఎంపీవో విఠల్‌రెడ్డి, సూపర్ ఇండెంట్ షాకీర్, కార్యాలయ సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'జహీరాబాద్‌లో ప్రభుత్వ ఐటీఐని ఏర్పాటు చేయాలి'

జహీరాబాద్, ఆగస్టు 23: పట్టణంలో ప్రభుత్వ ఐటీఐని ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లాకార్యదర్శి మహేష్ పేర్కొన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ప్రభుత్వ ఐటీఐ లేకపోవడంతో విద్యార్థులు ఎంతగానో నష్టపోతున్నారన్నారు. విద్యా రంగ సమస్యలను పరిష్కారం కోసం సంగారెడ్డిలో ఈ నెల 27,28 తేదీల్లో శిక్షణాతరగతులు, సెమినార్ నిర్వహిస్తున్నామన్నారు. జహీరాబాద్‌లో ప్రభుత్వ ఐటీఐని ఏర్పాటు చేసేవరకు తాము విశ్రమించబోమని ఆయన స్పష్టం చేశారు.

ఓపెన్ జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నారాయణఖేడ్,ఆగస్టు 23: ఖేడ్ మున్సిపల్ ప్రజలు స్థానిక ఆక్సిజన్ పార్కులోని ఓపెన్‌జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ కోరారు. శుక్రవారం ఆయన ఖేడ్ మున్సిపల్‌పరిధిలోని పలు వార్డుల్లో పర్యటించి పారిశుధ్యం, తాగునీటిసరఫరా, జ్వర సర్వేను పర్యవేక్షించారు. అనంతరం ఓపెన్‌జిమ్‌ను తనిఖీ చేశారు. జిమ్‌కు వచ్చిన యువకులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

పలుచోట్ల ఉచిత వైద్య శిబిరాలు.. మందుల పంపిణీ



తూప్రాన్‌లో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తూప్రాన్, ఆగస్టు 23: పట్టణంలో శుక్రవారం మున్సిపాలిటీ, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఈ ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రోగులకు బీపీ, షుగర్ పరీక్షలతోపాటు మలేరియా పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ, కమిషనర్ ఖాజామొహియుద్దీన్, మేనేజర్ రఘువరన్ సందర్శించి, వైద్యపరీక్షల తీరును పరిశీలించారు. వైద్యులు పద్మకుమారి, స్వప్న, తిరుపతి, సూపర్‌వైజర్ పల్లవి, సిబ్బంది, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

- నర్సాపూర్: మండలంలోని ఆవంచలో సంగారెడ్డి వెల్‌నెస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి మేనేజర్ శివరామకృష్ణ, డాక్టర్ కరుణ, పంచాయతీ కార్యదర్శి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.
- టేక్మాల్: ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ మౌనిక పేర్కొన్నారు. గురువారం టేక్మాల్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఫిజియోథెరపీ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మౌనిక మాట్లాడుతూ.. మెడ నొప్పులు, నరాల బలహీనత ఉన్నవారికి వ్యాయామ పరీక్షలు చేశామన్నారు. కార్యక్రమంలో ఎల్ఈఆర్‌పీ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.
- చిన్నశంకరంపేట: మండలంలోని శాలిపేట గ్రామంలో రెండో రోజు శుక్రవారం ఫీవర్ సర్వే నిర్వహించారు. గత నాలుగు రోజుల క్రితం ఓ యువకుడు డెంగీతో మృతి చెందంతో ముందస్తు చర్యగా మండల వైద్యాధికారి డాక్టర్ సాయి సింధు ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు ను ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వేలు చేసి, పరిశుభ్రతపై ప్రజలకు సూచనలు చేశారు.
- మునిపల్లి: మండల పరిధిలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో శుక్రవారం హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్‌క్యాంపు నిర్వహించారు. క్యాంపునకు హాజరైన 103మంది రోగులకు ఏఐజీ ఆసుపత్రి డాక్టర్లు ఎండోస్కోప్, అల్ట్రాసౌండ్, రక్త పరీక్షలు, షుగర్, బీపీ తదితర పరీక్షలు చేసి మందులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు హర్షిణిరెడ్డి, సందీప్ నాథ్, వినీత్, పంతం ప్రవళిక, సుధీర్‌రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: రోహిత్‌రావు



కల్యాణి లక్ష్మి లబ్ధిదారుకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

మెదక్ అర్బన్, ఆగస్టు 23: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మార్కెట్ కమిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మెదక్ పట్టణంతో పాటు మండలంలోని 78మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ..పేదింటి ప్రజలకు కల్యాణి లక్ష్మి పథకం వరం లాంటిదన్నారు. కాంగ్రెస్ సర్కార్ అందించే పథకాలు ప్రతీ ఒక్కరికి అందేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, సీనియర్ నాయకులు శ్రీనివాస్ చౌదరి, పట్టణ, మండల పార్టీ అధ్యక్షుడు అంజనేయులుగౌడ్, శంకర్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

- హవేళిఘణపూర్, ఆగస్టు 23: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గొల్లకుర్మ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మల్లన్న ఆలయ ఉత్సవాల్లో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు శుక్రవారం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు లక్కరు శ్రీనివాస్, మాజి సర్పంచ్ శ్రీకాంత్, రాములు, పరుశురామ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'రుణమాఫీ ప్రక్రియతో రైతులకు ప్రయోజనం'

జహీరాబాద్, ఆగస్టు 23: రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని అమలు చేసిన రుణమాఫీ ప్రక్రియ ఓ బృహత్తరమైన కార్యక్రమమని జిల్లా కాంగ్రెస్‌పార్టీ ఉపాధ్యక్షుడు ముల్తానీ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గతంలో కొనసాగిన బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఒరగబెట్టిందేమీలేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకకాలంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీని చేయడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు ఆయన చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణమాఫీ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

నారాయణఖేడ్, ఆగస్టు 23: సిర్గాపూర్ మండలం ఉజలంపాడ్‌కు చెందిన ప్రియాంకకు సీఎంఆర్ఎఫ్ కింద రూ.14,500 ఆర్థికసాయం మంజూరైంది. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి లబ్ధిదారుకు చెక్కును అందజేశారు. కాగా నిజాంపేట మండలం జంబికుంటకు చెందిన మామిడిప్రసాద్ ఇటీవలరోడ్డు మృతి చెందగా గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబీకులను పరామర్శించారు.

- రాయికోడ్, ఆగస్టు 23: రాయికోడ్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జి.అంజయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలాజీనర్సింహులు తదితరులు పాల్గొన్నారు.
- రేగోడు, ఆగస్టు 23: పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉందని రాయికోడ్ పీసీసీ మెంబర్ మున్నూరు కిషన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దిగంబరరావ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలానికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు వారు అందజేశారు. మండలంలో మొత్తం 45 మంది లబ్ధిదారులకు గానూ రూ. 13.22లక్షల విలువైన చెక్కులు మంజూరైనట్లు తెలిపారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి





మెదక్‌లో చంద్రయాన్ 3 నమూనాలతో సిద్ధార్థ్ విద్యార్థులు, రామాయంపేట వివేకానంద పాఠశాలలో వ్యోమగామి వేషధారణలో విద్యార్థులు



నాగల్‌గిద్ద: మోర్గి మోడల్ కళాశాలలో నమూనాల ప్రదర్శన

చంద్రయాన్-3 విజయవంతమై ఏడాదికాలం పూర్తవుతున్న సందర్భంగా పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారం జాతీయ మొదటి అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చంద్రయాన్‌తో పాటు అంతరిక్ష నమూనాలను ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు.

టేక్మాల్, ఆగస్టు 23: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొని, భావి శాస్త్రవేత్తలు కావాలని డీఈవో రాధాకృష్ణ ఆకాంక్షించారు. జాతీయ మొదటి అంతరిక్ష దినోత్సవం సందర్భంగా మండలంలోని ధనూర జడ్పీఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డీఈవో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులే దేశ భవిష్యత్తు అని, వారిని ఉత్తమంగా తీర్చిదిద్దేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని మార్గనిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో నీలకంఠం, జిల్లా నోడల్ అధికారి సుదర్శనమూర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసంత, ఏఏపీసీచైర్మన్ సత్యనారాయణ, ఉపాధ్యా యులు విద్యార్థులు పాల్గొన్నారు.

- మెదక్ అర్బన్: మెదక్ పట్టణంలోని సిద్ధార్థ్ విద్యాసంస్థల్లో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చంద్రయాన్-3 నమూనాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల అధినేత శ్రీనివాస్ చౌదరి మాట్లాడుతూ.. విద్యార్థులు సైన్స్ అండ్ టెక్నాలజీ వైపు మొగ్గు చూపాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంధ్యారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- రామాయంపేట: రామాయంపేటలోని వివేకానంద విద్యాలయంలో జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా శుక్రవారం విద్యార్థినీ విద్యార్థులు వ్యోమగామి వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నారు. అలాగే చంద్రయాన్-3 విశిష్టతపై జరిగిన ఉపన్యాసాలు, చిత్ర లేఖనం పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- నాగల్‌గిద్ద : మండలపరిధిలోని మోర్గి మోడల్ కళాశాలలోశుక్రవారం నేషనల్ స్పేస్ డే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పోస్టర్ ప్రజంటేషన్ తోపాటు చంద్రయాన్-3 మోడల్ నమూనాలను తయారు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమేష్, ఉపాధ్యాయులు విద్యార్థులుపాల్గొన్నారు.